సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 6 । జూన్ । 2025



టన్ను చీనీ రూ.31,770

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31,770, కనిష్టంగా రూ.3 వేలు పలికాయి.



త్యాగానికి ప్రతీక బక్రీద్

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. 10లో

గరిష్టం/కనిష్టం 36.8°/20.9°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు



పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి తరలివచ్చారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ వేల సంఖ్యలో ప్రజల మద్దతుతో వెన్నుపోటు దినం కార్యక్రమం జరిగిందన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్నింటిలో ఘోరంగా విఫలమైందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను వంచించడంతో ఏడాది కాలంలోనే ప్రజలు ఉద్యమబాట పట్టారన్నారు.

సక్రమంగా విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ సీజీఎం వరకుమార్

ధర్మవరం: విద్యుత్ అంతరాయాన్ని నివారించి సక్రమంగా విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ సీజీఎం వరకుమార్ తెలిపారు. ధర్మవరం సబ్ డివిజన్‌లోని సబ్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాలి, వర్షం వచ్చే సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పదిరోజుల్లో పరిష్కరించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. పాత ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేయించడం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే ఏర్పాటు చేయడం తదితర వాటిని సత్వరమే చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రత్యేక దృష్టిని సారించాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు ఏమైనా సమస్యలుంటే 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

భూసేకరణ వేగవంతం చేయండి

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఇంధన ప్రాజెక్ట్ స్థాపనకు అవసరమైన భూసేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంధన ప్రాజెక్ట్ భూసేకరణ సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో కొన్ని వేల మెగావాట్ల పునరుత్పాదన ఇంధన ప్రాజెక్ట్ స్థాపనకు అవసరమైన భూమిని సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు వారి పరిధిలోని మండలాల్లో అందుబాటులో ఎంత భూమి ఉంది అన్న వివరాలను వెంటనే సేకరించి నివేదించాలన్నారు. ప్రాజెక్ట్ స్థాపనకు అవసరమైన భూమిని ఇచ్చే రైతులకు ఎకరా భూమికి ఏడాదికి రూ.31 వేలు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హాకీ జట్టు ఎంపిక



జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టుతో హాకీ ఆంధ్రప్రదేశ్ సభ్యులు

ధర్మవరం: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ భీమవరంలో జరగనున్న 15వ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా మహిళల హాకీ జట్టును ఎంపిక చేసినట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బంధనాథం సూర్యప్రకాష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహిళల హాకీ జట్టు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాకీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరిప్రసాద్, సభ్యులు జెన్నే చంద్రశేఖర్, ఉడుముల కిరణ్, సత్యసాయి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ హస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జట్టు సభ్యులు: సింధు (కెప్టెన్),పవిత్ర , మధురిమబాయ్, వైష్ణవి, హేమ, దివ్య, నసీమా, వర్ష, హర్షిత, నవ్యశ్రీ, దుర్గ, శివగంగా, శ్రీలేఖ, మోక్షిత, గుణశ్రీ, వరలక్ష్మి, ఉషశ్రీ, హర్షితలు.

కోచ్: మారుతీకుమార్, మేనేజర్ అరవింద్‌గౌడ్

పచ్చని కాపురాల్లో... వివాహేతర చిచ్చు

వివాహేతర సంబంధాలు పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి. తమ బంధానికి అడ్డుగా ఉన్నారన్న కారణంతో ఏకంగా హత్యలదాకా వ్యవహారం వెళ్తోంది. ఇలాంటి ఘటనల్లో ఎక్కువగా బాధితుల బిడ్డలు అనాథలుగా మారుతుండటం అందరినీ కలవరపెడుతోంది. జిల్లా పరిధిలో తరచూ ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.



- ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన ఓ వివాహితకు రొద్దం మండలానికి చెందిన పురుషుడితో వివాహేతర సంబంధం ఏర్పడింది. అనుమానం వచ్చిన భర్త మంజునాథ్ నిత్యం వేధించసాగాడు. మధ్యలో అడ్డుగా ఉన్న భర్తను తొలగించుకునేందుకు ప్రియుడితో కలిసి భార్య పన్నాగం పన్నింది. మద్యం మత్తులో ఉన్న భర్తను కిరాయి ఇచ్చి హత్య చేయించింది. గతేడాది జరిగిన ఈ ఘటనకు కారణాలు ఆలస్యంగా వెలుగు చూశాయి. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఏడాది తర్వాత మృతదేహాన్ని రీపోస్టుమార్టం చేయడంతో వాస్తవాలు వెలుగు చూశాయి.
- నల్లమాడ మండలం కుటాలపల్లిలో గతేడాది ఎన్నికల సమయంలో ఓ దారుణ హత్య వెలుగు చూసింది. ఇద్దరు వ్యక్తులు ఒకే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడమే దీనికి కారణంగా తేలింది. అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి ఒకరికి తెలియకుండా మరొకరు వివాహేతర సంబంధం కొనసాగించారు. అయితే ఆర్థిక లావాదేవీల్లో తేడా రావడంతో శ్రీనివాసరెడ్డి మరికొందరితో కలిసి అమర్‌నాథ్‌రెడ్డిని హతమార్చాడు. గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

- భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో అనర్థాలు
- చిచ్చు రేపుతోన్న సోషల్ మీడియా పరిచయాలు
- ఇద్దరి మధ్యకు మూడో వ్యక్తి రావడంతో హత్యలకు దారి
- బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారుతున్న పిల్లలు

సాక్షి, పుట్టపర్తి

రెండు మనసులు.. మూడు ముళ్లు.. ఏడు అడుగులతో ముడిపడిందే భార్యాభర్తల బంధం. జీవితాంతం ప్రేమ, ఆప్యాయతలతో పాటు కష్టసుఖాలు, కుటుంబ బాధ్యతలను మోసుకుంటూ ముందుకు సాగేదే సంసారం. ఈ పవిత్ర బంధం.. మనస్పర్థలు, అనుమానాలు, కుటుంబ కలహాలతో విచ్ఛిన్నం అవుతోంది. చిన్నపాటి మనస్పర్థల కారణంగా పరాయి వ్యక్తులతో చనువుగా పెరిగి.. సాన్నిహిత్యం ఏర్పడుతోంది. అదే వివాహేతర సంబంధాలకు దారి తీస్తోంది. అలాంటి సంబంధాలు పచ్చని కాపురాల్లో చిచ్చు రేపుతున్నాయి. ఈ



క్రమంలో కొంతమంది అడ్డు తొలగించుకునే క్రమంలో భర్తలను, ప్రియులను చంపేస్తున్నారు. ఫలితంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. చిన్నారులు అనాథలుగా మారుతున్నారు. హత్య చేసి పరారీ అవుతుండటంతో చిన్నారులు ఎవరి దగ్గర ఉండాలో అర్థం కాక బాల్యంలోనే కార్మికులుగా మారి అష్టకష్టాలు పడుతున్నారు.

అఘాయిత్యాలకు దారి తీస్తూ..

వివాహేతర సంబంధాలతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు పెరిగి అఘాయిత్యాలకు దారి తీస్తున్నాయి. ఇద్దరి మధ్యలోకి మరొకరు రావడంతో పరిస్థితులు నిమిషాల్లో మారిపోతున్నాయి. క్షణికావేశంతో హత్యలు, ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. దంపతుల్లో ఎవరో ఒకరు జైలుకు వెళ్లినా.. కనీసం బెయిల్ ఇప్పించేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో అలాంటి దంపతుల పిల్లలు అనాథలుగా మారుతున్నారు. అంతేకాదు వివాహేతర సంబంధాలతో ఎలాంటి పరిణామాలు జరిగినా.. వారి కుటుంబ సభ్యులు సమాజంలో తలెత్తుకొని తిరగలేని పరిస్థితి నెలకొంది.

కారణాలు ఎన్నెన్నో..

- పని ఒత్తిడితో జీవిత భాగస్వామికి సరైన సమయం కేటాయించకపోవడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి.
- చిన్న సమస్యలను పెద్దవిగా చూస్తూ.. పదే పదే చర్చించి.. తల్లిదండ్రుల వరకూ వెళ్లడం .. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు.
- జీవిత భాగస్వాములు తాము చెప్పినట్లు వినలేదంటూ ఇద్దరిలో ఎవరో ఒకరు దారి తప్పి సమస్యల ఊబిలో కూరుకుపోతున్నారు.
- స్మార్ట్‌ఫోన్లను అతిగా వినియోగించి సోషల్ మీడియా పరిచయాలతో ప్రాణాల మీదికి తెచ్చుకోవడం.
- మద్యానికి బానిసై ఆర్థిక సమస్యల్లో చిక్కుకుని .. కుటుంబ పోషణ గురించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం కూడా కారణమవుతోంది.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి



దంపతుల మధ్య మనస్పర్థలు రావడం సహజమే. అయితే క్షణికావేశాలకు వెళ్లకుండా.. సామరస్యంగా ఇద్దరూ పరిష్కార మార్గం ఎంచుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. వివాహం జరిగిన కొత్తలో మనస్పర్థలు వచ్చినా.. వెంటనే సరిదిద్దుకోవాలి. అయితే ఇరవై ఏళ్ల దాంపత్య జీవితంలో కూడా ఇంకా సమస్యలు వెలుగు చూస్తుండటం అవగాహన లోపమే. దంపతులిద్దరూ పిల్లలు, కుటుంబ బాధ్యతల గురించి తెలుసుకుంటే ఎలాంటి మనస్పర్థలు రావు. క్షణికావేశంతో తీసుకునే నిర్ణయాలతో కుటుంబం రోడ్డున పడుతుంది. అంతేకాకుండా చిన్నారులు అనాథలుగా మారాల్సి వస్తోంది.

– వి.రత్న, ఎస్పీ

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవనాల్లో శుక్రవారం నిర్వహించనున్నట్లు సీఈఓ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన స్థాయీ సంఘం–1, 2, 4, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు ప్రధాన సమావేశ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం–3, 5, 6(వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన ప్రారంభమవుతాయని వివరించారు. గత సమావేశాల్లో ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సంబంధించిన వివరాలపై సమగ్ర సమాచారంతో అధికారులు హాజరు కావాలని సూచించారు.

- స్థాయీ సంఘ సమావేశాల్లో ఐసీడీఎస్‌లో పోషణ్ పక్వాడా నిర్వహణకు మంజూరైన నిధులు రూ.5 లక్షలు ఖర్చు పెట్టకుండా సీడీపీఓలు వాడుకోవడం, ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా కార్పొరేట్ హంగులతో కార్యాలయాలు ఉండాలన్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆశయం మేరకు ఐసీడీఎస్‌లో రూ.5 కోట్లతో ఆధునీకరించిన వాటిని ఆర్నెల్లకే పీకి పడేయడంపై సభ్యులు చర్చించే అవకాశం ఉంది. ముంగారు సేద్యాలు మొదలైన కారణంగా ఎరువుల ఊసే లేకపోవడం, పంట రుణాల రెన్యూవల్, కొత్త రుణాల మంజూరు అంశాలపై సభ్యులు ప్రశ్నలు సంధించే పరిస్థితి ఉంది. కరోనా మళ్లీ కోరలు చాస్తున్న తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ పెట్టకపోవడంపైనా నిలదీసే పరిస్థితి కనిపిస్తోంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పుట్టపర్తి టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఎస్పీ రత్న పేర్కొన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ అందరి సహకారంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని నివాసం, కార్యాలయ ఆవరణలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరి ఉందన్నారు. పర్యావరణంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు మరొకరికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు వలి, మహేష్, డీసీఆర్‌బి సీఐ శ్రీనివాసులుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: పర్యావరణానికి హాని కలిగిస్తే ఆరోగ్యానికి ముప్పు తప్పదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పుట్టపర్తిలోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ప్రశాంతి గ్రామం వరకూ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ ప్రతికూలతలు , ప్లాస్టిక్ వాడకం, విష రసాయనాల విడుదల తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. విస్తారంగా మొక్కలు పెంచాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో నేల క్షీణిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సమత, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

నిర్మల సీతారామన్‌కు ఘన స్వాగతం

గోరంట్ల: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా గురువారం రాత్రి మండల పరిధిలోని నాసిన్ సంస్థ అతిథి భవనానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న ఘన స్వాగతం పలికారు. శుక్రవారం నాసిన్ సంస్థలో జరిగే పలు కార్యక్రమాల్లో నిర్మల సీతారామన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి పాల్గొంటారని నాసిన్ వర్గాలు తెలిపాయి.



కేంద్ర మంత్రికి మొక్క అందిస్తున్న కలెక్టర్ చేతన్

ఎస్‌ఏ పదోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు గురువారం సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. స్థానిక శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల టీచర్లు హాజరయ్యారు. ఒక్కో పోస్టుకు ఇద్దరు చొప్పున 1:2 ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచామని విద్యాశాఖ అధికారులు చెప్పినా...మొత్తం 382 పోస్టులు ఖాళీలుంటే, 372 మంది ఎస్జీటీలు రావడం విశేషం. అయితే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు బదిలీ ఉత్తర్వుల కోసం ఎదురుచూశారు.



సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న అధికారులు

మొత్తం 4,589 మంది దరఖాస్తు..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,589 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకుని వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 2,456 మంది తప్పనిసరి, 2,133 మంది టీచర్లు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే.... బయలాజికల్ సైన్స్ 631 మంది, ఇంగ్లిష్ 656 మంది, హిందీ 383 మంది, కన్నడ ముగ్గురు, గణితం 847 మంది, పీడీలు 262 మంది, ఫిజికల్ సైన్స్ 616 మంది, సంస్కృతం ఏడుగురు, సోషల్ 544 మంది, స్పెషల్ ఎడ్యుకేషన్ 37 మంది, తెలుగు 584 మంది, ఉర్దూ 19 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- జిల్లా పరిశీలకులుగా జేడీ సుబ్బారావు



సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

అనంతపురం ఎడ్యుకేషన్: నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాలు, బెంగళూరులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రోజూ రెండు విడతలుగా ఈనెల 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. డీఈఓ పరిధిలోని కేంద్రాలకు పరిశీలకులుగా జాయింట్ డైరెక్టర్ సుబ్బారావును నియమించారు. పరీక్షలయ్యేదాకా ఆయన ఇక్కడే ఉంటూ పరీక్ష కేంద్రాలను పరిశీలించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అన్ని కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. అభ్యర్థులు గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

పుట్టపర్తిటౌన్: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి జరిగే డీఎస్సీ పరీక్షలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. గురువారం బీడుపల్లి వద్ద ఉన్న సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ రత్న , డీఎస్పీ విజయకుమార్, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్‌తో పాటు 30 యాక్ట్ కూడా అమల్లో ఉంటుందన్నారు. డీఎస్పీ, 12 మంది సీఐలు, ఎస్ఐలతో పాటు 130 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీ అంబికా అనుచరుడి దౌర్జన్యం

సాక్షి టాస్క్ ఫోర్స్: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అనుచరుడు దాము రెచ్చిపోయాడు. తమకు చెల్లించాల్సిన చీటి నగదు అడిగిన మైనార్టీ కుటుంబంపై దాడికి తెగబడ్డాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి సోమందేపల్లిలో చోటు చేసుకుంది. బాధితుల వివరాలమేరకు.. నాలుగేళ్ల క్రితం దాము వద్ద చికెన్ సెంటర్ నిర్వాహకురాలు వహీదా బీ రూ.లక్ష చీటీ వేశారు. రూ.80 వేలు దాము బాకీ పడగా బక్రీద్ పండుగ ఉందని, తమకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వమని దివ్యాంగుడైన వహీదా బీ కుమారుడు ముబారక్ ఫోన్ ద్వారా దామును అడిగాడు. తననే డబ్బులు డిమాండ్ చేస్తావా అంటూ కోపోద్రిక్తుడైన దాము తన అనుచరులు ముగ్గురితో వహీదా బీ ఇంటి వద్దకు చేరుకొని ఆమెపై చేయి చేసుకున్నాడు. అడ్డు పడ్డ ముబారక్‌తో పాటు అతని భార్య యాస్మిన్‌పై కూడా చేయి చేసుకున్నట్లు బాధితులు వాపోయారు. చికెన్ సెంటర్‌లో వస్తువులు పడేసి హంగామా చేశాడన్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. తనకు ఎంపీ అంబికా అండ ఉందని ఏమీ చేసుకోలేరని ఫిర్యాదు కోసం స్టేషన్‌కు వెళ్లిన బాధితులను బెదిరించినట్లు చెబుతున్నారు.

సామూహిక ఉపనయన మహోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్‌రాజు



ఉపనయన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బ్రాహ్మణ వేద విద్యార్థులకు సామూహిక ఉపనయన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితులు ఉపనయన ఘట్టాన్ని నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి ఉపనయనంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు.

క్లుప్తంగా

రేషన్ డీలర్ల ఇష్టారాజ్యం



ఎస్.సద్లపల్లిలో రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిల్చొన్న కార్డుదారులు

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లుగా కార్డుదారులు ఆరోపిస్తున్నారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడినా రేషన్ అందుకోవడం గగనంగా మారిందని 13వ వార్డు పరిధిలోని ఎస్.సద్లపల్లి కార్డుదారులు వాపోయారు. ముందుగా తమ అనునూయులు, టీడీపీ వాళ్లకు తొలి ప్రాధాన్యతనిస్తూ వారికి రేషన్ అందించిన తర్వాతనే ఇతరుల కార్డులు తీసుకుంటున్నారని మండిపడ్డారు. అంతేకాక చక్కెర‌పై అదనంగా రూ.3 వసూలు చేస్తున్నారని వాపోయారు. విషయం తెలుసుకున్న వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కురుబ శ్రీనాథ్, సభ్యుడు హరిగోపాలరెడ్డి అక్కడకు చేరుకుని ప్రజలతో కలసి డీలర్‌ను నిలదీశారు. సద్లపల్లిలోనే కాకుండా ముక్కిడిపేటలోని మూడు దుకాణాల్లోనూ ఇదే తంతు నడుస్తోందని మండిపడ్డారు. రేషన్ పంపిణీలో అవతవకలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి

- ఏడీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి




కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ప్రశాంతి నిలయం: జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 100 శాతం ఉచిత విద్య అందేలా ఆదేశించాలని కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాత్రికేయులు విన్నవించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్... డీఈఓ కిష్టప్ప ఫోన్ చేసి జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- రేపు 'ఈద్ – ఉల్ – అదాహ్'
- జిల్లా వ్యాప్తంగా ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

పుట్టపర్తి టౌన్: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది బక్రీద్. ఇబ్రహీం అలైహిస్సలాం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాం త్యాగస్మరణకు గుర్తుగా శనివారం ఉదయం 8 గంటలకు మసీదులు, ఈద్గాహ్‌ల వద్ద 'ఈద్ – ఉల్ – అదాహ్'ను వేలాదిమంది ముస్లింలు ఆచరించనున్నారు. ఇందుకోసం మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగలో 'ఖుర్బానీ' చేసేందుకు జిల్లా ముస్లింలు సిద్ధమయ్యారు. నమాజు అనంతరం తమ శక్తికి తగినట్లుగా పొట్టేళ్లు, మేకపోతులను ఖుర్బానీ చేసి ఆ మాంసాన్ని పంచిపెట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



బక్రీద్ విశిష్టత..

బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే ఖుర్బానీ అంటే సమర్పణ, త్యాగం, బలి అని అర్థం. సుమారు 4వేల ఏళ్ల క్రితం ఇరాక్ దేశంలో పండిత కుటుంబంలో జన్మించిన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీంకు (సల్లల్లాహు అలైహివసల్లం) ఒకరోజున కల వచ్చింది. ఆ స్వప్నంలో తన 86 ఏళ్ల వృద్ధాప్యంలో జన్మించిన ఏకైక కుమారుడు ఇస్మాయిల్‌ను ఖుర్బానీ చేయాలని అల్లాహ్ కలలో ఇబ్రాహీంను ఆదేశించినట్లు కల సారాంశం. అల్లాహ్ ఆదేశానుసారం తన కుమారుడిని బలి ఇవ్వడానికి ఇబ్రహీం సిద్ధం కాగా అల్లాహ్ దానిని స్వీకరించి ఇస్మాయిల్‌కు బదులు స్వర్గం నుంచి ఓ పొట్టేలును పంపి ఖుర్బానీ జరిగేలా చేశారు.

త్యాగ నిరతిని కలిగి ఉండాలి



బక్రీద్ పండుగ అనేది త్యాగానికి ప్రతీక. ఖుర్బానీ అంటే జంతు బలి కాదు, మానవుడు దైవమార్గంలో తన సర్వస్వాన్ని త్యజిస్తానని చేసే ప్రకటన మాత్రమే. దైవాన్ని విశ్వసించడం, మానవులంతా ఒకటేనని నమ్మాలి. చెడును నిరోధించడం, మంచిని పెంచడం, కష్టాలలో సహనం వహిస్తూ, త్యాగ నిరతిని చూపించాలన్న సందేశమే ఖుర్బానీలో దాగి ఉంది.

– జాకీర్ ముక్తా సాహెబ్, ముతవల్లి, పుట్టపర్తి

ధర వింటే దిమ్మ తిరిగిపోతోంది!



రూ.52 వేలకు అమ్ముడుపోయిన పొట్టేలు

బక్రీద్ సీజన్లో పొట్టేళ్లకు భారీగా డిమాండ్ పెరిగింది. సాధారణంగా మాంసం కోసం పెంచే పొట్టేళ్లను.. వాటి బరువు ఆధారంగా ధర నిర్ణయిస్తారు. కానీ బక్రీద్ పండుగ నేపథ్యంలో విక్రయించే జీవాలకు బరువుతో పని లేదు. కేవలం రూపం, వాటి ఆరోగ్యాన్ని మాత్రమే చూస్తారు. దీంతో సాధారణ ధరల కన్నా ఏకంగా నాలుగు రెట్లు ఎక్కువకు పొట్టేళ్లు అమ్ముడు పోతున్నాయి. మాములు రోజుల్లో రూ.10 నుంచి రూ.15 వేలు పలికే పొట్టేళ్ల ధర.. బక్రీద్ డిమాండ్ కారణంగా రూ.30 నుంచి రూ.50 వేలకు పెరిగింది. వాడైన చూపులు.. మెలి తిరిగిన కొమ్ములు.. బలిష్టంగా ఉన్న పొట్టేళ్లు, మేకపోతుల ధర మరింత ఎక్కువగా ఉంటోంది. దిమ్మతిరిగేలా పెరిగిన ధరలతో పండుగ ఎలా చేసుకోవాలని ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– ఆత్మకూరు:







రూ.40 వేల నుంచి రూ.50 వేలతో అమ్ముడుపోతున్న పొట్టేలు, మేకపోతు, రూ.30 వేలకు కొనుగోలు చేసిన పొట్టేలును చూపుతున్న ఆత్మకూరు వాసి

ప్రైవేట్ వాహనదారుల ఘర్షణ

ఉరవకొండ: స్థానిక టీడీపీ ముఖ్యనేత ఆశీస్సులతో కూడేరు మండలానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు ఏడాదిగా అనంతపురం – ఉరవకొండ మార్గంలో అనధికార షటిల్ సర్వీసులు నడుపుతూ ప్రయాణికులను దోచుకుంటున్నారని లైట్ మోటార్ వెహికల్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మండిపడ్డారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రైవేట్ వాహనాలను అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. ఆ సమయంలో ఇరు వర్గాల వాగ్వాదం చెలరేగి ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. అప్పులు చేసి, బంగారం కుదవ పెట్టి దాదాపు 150 మంది వాహనాలను కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. తాము మూడు నెలలకు రూ.8.960 రోడ్ ట్యాక్స్ కట్టి, ఈఎంఐలు చెల్లిస్తున్నామన్నారు. టీడీపీ నేతల వాహనాలు కాదని ఇతరుల వాహనంలో ప్రయాణికులు ఎక్కబోతే దౌర్జన్యం చేస్తున్నారన్నారు. చివరకు ఆటోల్లో సైతం ప్రయాణికులను అనుమతించడం లేదన్నారు. తమతో పాటు గవిమఠం లోని వాహన స్టాండ్‌లో వాహనాలు పెట్టి క్రమ పద్ధతిలో బాడుగకు తిప్పుకుంటే అభ్యంతరం లేదన్నారు. అలా కాదని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పెట్టి దోపిడీ చేయాలనుకుంటే సహించేది లేదని తేల్చి చెప్పారు. దీనిపై ఇప్పటికైనా ఆర్టీసీ, ఆర్టీఓ అధికారులు మేల్కొని చర్యలు చేపట్టాలని కోరారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

రాప్తాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామానికి చెందిన బుంగ లింగారెడ్డి (75), అదే గ్రామానికి చెందిన హరిజన సాకే వెంకటరమణ ద్రాక్ష కొమ్మల కటింగ్ పనితో కుటుంబాలను పోషించుకుంటున్నారు. గురువారం గార్లదిన్నె వద్ద ద్రాక్ష కటింగ్‌కు వెళ్లాల్సి ఉండడంతో తన స్కూటీపై సాకే వెంకటరమణతో కలసి లింగారెడ్డి బయలుదేరాడు. తెల్లవారుజామున 5.15 గంటలకు రాప్తాడు సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న ఐచర్ షోరూమ్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో బుంగ లింగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ తన వాహనంతో సహా ఉడాయించాడు. తీవ్రంగా గాయపడిన సాకే వెంకటరమణను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, బుంగ లింగారెడ్డికి భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

బుళ్లసముద్రంలో చోరీ

మడకశిర రూరల్: మండలంలోని బుళ్లసముద్రం గ్రామంలో నివాసముంటున్న వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. శ్రీరామరెడ్డి కుటుంబసభ్యులు గ్రామంలో తమకు తెలిసిన వారికి ఇంటి తాళం ఇచ్చి విజయవాడ వెళ్లారు. బుధవారం రాత్రి దుండగులు తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు, ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లారు. చోరీ విషయాన్ని గురువారం ఉదయం గమనించిన స్థానికులు ఫోన్ ద్వారా శ్రీరామరెడ్డికి సమాచారం అందించారు. ఆయన ద్వారా విషయం తెలుసుకున్న సీఐ నగేష్ బాబు వెంటనే గ్రామంలోని శ్రీరామరెడ్డి ఇంటికి చేరుకుని పరిశీలించారు. బంగారు ఆభరణాలు, నగదుతో పాటు మొత్తం రూ.3 లక్షల వరకు చోరీ జరిగినట్లు గుర్తించారు. క్లూస్ టీంను రంగంలో దించి దుండగుల వేలి ముద్రలను సేకరించారు.

యువకుడి దుర్మరణం



సోమశేఖరనాయుడు (ఫైల్)

నల్లమాడ: కారు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నల్లమాడ మండలం దొన్నికోట గ్రామానికి చెందిన యనమల సోమశేఖర నాయుడు (30), సాయిలీల దంపతులకు మూడేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. బుధవారం భార్య, కుమారుడితో కలసి పుట్టపర్తి మండలం కంబాలపర్తిలోని అత్తారింటికి సోమశేఖర నాయుడు వెళ్లాడు. గురువారం ఉదయం కుటుంబంతో కలసి తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన నల్లమాడకు చేరుకోగానే తనకు పని ఉందంటూ భార్య, కుమారుడిని ఆటోలో ఎక్కించి పంపాడు. నల్లమాడలో పనిముగించుకున్న తర్వాత ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్న ఆయన.. ఎద్దులవాండ్లపల్లి తండా వద్దకు చేరుకోగానే చిల్లగోర్లపల్లికి వెళ్లే కాలిబాట వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనం రోడ్డు పక్కన ఉన్న గోతిలోకి దూసుకెళ్లింది. సోమశేఖర నాయుడు గాలిలో ఎగిరి కొన్ని అడుగుల దూరంలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్య అక్కడకు చేరుకుని బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతుని తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

11వ రోజుకు చేరిన రైతుల నిరసన



రోడ్డు పనులు అడ్డుకుంటున్న రైతులు

ముదిగుబ్బ: స్థానిక 342వ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా చేపట్టిన భూసేకరణకు ఇచ్చే పరిహారంపై రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం 11వ రోజుకు చేరుకుంది. న్యాయమైన పరిహారం ఇచ్చే వరకూ పనులు అడ్డుకుంటామని రైతులు తెలిపారు. పని ప్రాంతంలో యంత్రాలను అడ్డుకున్నారు. కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్‌నాయుడు, రాజేంద్రనాయుడు, హనుమంతు, ప్రసాద్, శంకర్, రమణ, సనత్‌కుమార్, ప్రభాకర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

పెనుకొండ రూరల్: బాల్య వివాహాన్ని కియా పోలీసులు అడ్డుకున్నారు. పెనుకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికతో చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన యువకుడితో వివాహం జరిపించేందుకు ఇరు కుటుంబాల పెద్దలు సిద్ధమయ్యారు. గురువారం ఉదయం కోన కణ్వాశ్రమంలో పెళ్లి తంతు జరుగుతుండగా సమాచారం అందుకున్న కియా ఎస్ఐ రాజేష్... సిబ్బందితో అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. బాలికతో పాటు తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలుచుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

మోతాదుకు మించి పురుగు మందులు వాడొద్దు



పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ముదిగుబ్బ: మోతాదుకు మించి పురుగు మందుల వాడకం వల్ల నష్టాలు అధికంగా ఉంటాయని రైతులకు రేకులకుంటలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ కిషోర్‌రెడ్డి సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల కలిగే నష్టాలపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. నూతన సాంకేతికత, కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పథకాలు, వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర అంశాలను వివరించారు. పంటల సాగులో అనువైన విత్తనాలు, వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్య పరిచారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనరసింహులు, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల అధ్యాపకుడు డాక్టర్ దీపక్, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలి: ఆర్ఐఓ



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆర్ఐఓ సయ్యద్ మౌల

కదిరి అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు అధ్యాపకులంతా కృషి చేయాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి (ఆర్ఐఓ) సయ్యద్ మౌల సూచించారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో ఆయన సమావేశం నిర్వహించారు. కళాశాలలో ఇప్పటికే ఉన్న విద్యార్థుల సంఖ్య... జూనియర్ ఇంటర్ ప్రవేశాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర ప్రసాద్, అధ్యాపకులు ఎంఎస్ ప్రశాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బ్రెయిన్ డెడ్ బాలుడి అవయవ దానం



శ్రీహరి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: బ్రెయిన్ డెడ్ అయిన ఓ బాలుడి అవయవాలను అతడి తల్లిదండ్రులు దానం చేశారు. మృతిచెందిన తర్వాత తమ కుమారుడు మరికొంత మంది జీవితాల్లో వెలుగులు నింపుతాడనే భావంతో పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి మరీ అవయవదానానికి అంగీకరించారు. వివరాలిలా ఉన్నాయి... కళ్యాణదుర్గం మండలం గరుడాపురం – కొత్తూరు గ్రామాల మధ్య మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. తలకు తీవ్ర గాయమై అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీహరి (18) బ్రెయిన్ డెడ్ అయినట్లు గురువారం వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడి తల్లిదండ్రులు అనసూయమ్మ, ఈరన్న, సోదరి సింధూజ, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు... శ్రీహరి అవయవాలను దానం చేస్తే కొంతమందికి ప్రాణదానం చేయవచ్చని తల్లిదండ్రుల వద్ద ప్రస్తావించడంతో అంతటి దుఃఖంలోనూ వారు అంగీకారం తెలిపారు. దీంతో శ్రీహరి గుండె, కళ్లు, కిడ్నీలను జీవన్‌దాన్ ప్రతినిధులు సేకరించి అత్యవసరమైన రోగుల కోసం మెట్రో నగరాల్లోని ఆస్పత్రులకు తరలించారు. కాగా, ఇంటర్ వరకూ చదువుకున్న శ్రీహరి... కొత్తూరు గ్రామంలోనే తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉండేవాడు. అవయవ దానం చేసేందుకు అంగీకరించిన శ్రీహరి తల్లిదండ్రులను వైద్య సిబ్బంది అభినందించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. పెళ్లి కాలేదన్న కారణంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడగా... తాగుడు మానలేక మరో యువకుడు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నారు.



శ్రీనివాసులు (ఫైల్)

- **పరిగి:** మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గంగాధరప్ప, సుజాతమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాసులు(20) ఆత్మహత్య చేసుకున్నాడు. తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ కూలి పనులతో జీవనం సాగిస్తుండేవాడు. తన అక్క లావణ్య భర్త కృష్ణ మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. చిన్న వయసులోనే అక్క భర్తను కోల్పోవడంతో మనోవేదనకు లోనై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కుటుంబసభ్యులందరూ గురువారం సమీప బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీనివాసులు ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న ఎస్ఐ రంగడు యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి అన్న అభి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- **పెనుకొండ రూరల్:** మండలంలోని గోనిపేటకు చెందిన బోయ శివకుమార్ (25) ఆత్మహత్య చేసుకున్నాడు. శివకుమార్‌కు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. ఏ ఒక్కటీ కుదరకపోవడంతో మనస్తాపానికి గురైన అతను బుధవారం రాత్రి ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. కుటంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు వేసుకున్న ఉరికి విగత జీవిగా వేలాడుతున్న శివకుమార్‌ను గుర్తించిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. మృతుడి తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- **లేపాక్షి:** మండలంలోని చోళసముద్రం పంచాయతీ నాగానపల్లికి చెందిన ఆదినారాయణప్ప భార్య సవిత(35) ఆత్మహత్య చేసుకుంది. వివాహమై పదేళ్లు కావస్తున్నా... సంతానం కలగలేదు. ఈ క్రమంలోనే భర్త తాగుడుకు బానిసయ్యాడు. దీంతో దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. భర్తలో మార్పు రాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సవిత... బుధవారం అర్ధరాత్రి ఇంట్లో పైకప్పునకు తాడుతో ఉరి వేసుకుంది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్ఎంపీ అనుమానాస్పద మృతి

- పెన్నహోబిలం గుట్టల్లో కాలిన మృతదేహం గుర్తింపు



మంజునాథ్‌రెడ్డి (ఫైల్)

ఉరవకొండ: ఓ ఆర్ఎంపీ అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం సిద్దారాంపురం గ్రామానికి చెందిన ఆవుల గోపాలరెడ్డి, సువర్ణమ్మ దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు మంజునాథ్‌రెడ్డి ఉన్నారు. కుమారుడు గ్రామంలోనే ఆర్ఎంపీగా గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం తండ్రి మృతి చెందాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారం మంజునాథరెడ్డి (30)పై పడింది. కుమార్తెకు వివాహం కావడంతో కుమారుడికి పెళ్లి చేయాలని తల్లి సంబంధాలు చూస్తోంది. అయితే సంబంధాలు ఏవీ కుదరకపోవడంతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులతో చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి పెంచుకున్న మంజునాథ్ ఈ నెల 4న ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ నెల 5న కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఉరవకొండ మండలం పెన్నహోబిలం గుట్టల్లో కాలిపోయిన ఓ మృతదేహాన్ని గమనించిన స్థానికుల సమాచారంతో సీఐ మహనంది, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. పెన్నహోబిలంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ఆధారంగా మృతుడిని మంజునాథ్‌గా అనుమానిస్తూ సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పదోన్నతి పంచాయితీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల జరిగిన హెచ్ఎం పదోన్నతుల్లో నాట్ ఆప్టెడ్ (ప్రస్తుతం పదోన్నతి ఇష్టం లేదు) ఇచ్చిన ఓ స్కూల్ అసిస్టెంట్ ఇప్పుడు పదోన్నతి కావాలని అడుగుతున్నాడు. ఈ విషయం విద్యాశాఖలో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. వివరాలు.. స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్ఎం పదోన్నతులకు ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించారు. ధర్మవరం మునిసిపల్ బాలికల పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఓ టీచరు... పదోన్నతి జాబితాలో ఉన్నాడు. వాస్తవానికి ఇదే స్కూల్‌లో హెచ్ఎం పోస్టు ఖాళీ ఉంది. తాను హెచ్ఎం పదోన్నతి తీసుకుని ఇదే స్కూల్‌కు రావాలని భావించాడు. సీనియార్టీ జాబితాలో ఈయనకంటే మరో ఇద్దరు టీచర్లు ఉన్నారు. సదరు టీచరు కౌన్సెలింగ్‌కు హాజరైనప్పుడు ధర్మవరం బాలికల పాఠశాల పోస్టు ఖాళీగానే ఉంది. నిబంధనల ప్రకారం 50 ఏళ్లు దాటిన పురుష టీచరు బాలికల పాఠశాల కోరుకున్నా... ఆయన వెనక (చివరిస్థానంలో ఉన్నా సరే) ఉన్న మహిళా టీచరు సదరు బాలికల పాఠశాల కోరుకుంటే ఆయన వెనక్కు రావాల్సిందే. ఆ సమయంలో మిగులుగా ఉన్న స్కూళ్లకు కేటాయిస్తారు. ఇదే విషయాన్ని సదరు టీచరుకు అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఆయన పదోన్నతి వద్దని ఆప్షన్ ఇచ్చాడు. ఈ క్రమంలో సీనియార్టీ జాబితాలో ఆ టీచరు వెనుక మరో ఇద్దరు టీచర్లు ఉన్నారు. అక్కడితో ఖాళీలన్నీ పూర్తవుతాయి. ఇద్దరూ పదోన్నతి పొందారు. పురుష టీచరు తీసుకోకపోవడంతో సీనియార్టీ జాబితాలోని మూడో టీచరుకు అవకాశం కల్పించారు. తాజాగా నాట్ ఆప్టెడ్ ఇచ్చిన సదరు టీచరు రంగంలోకి దిగి డీఈఓపై ఉన్నతాధికారులతో ఒత్తిళ్లు చేయించినట్లు తెలిసింది. దిక్కు తెలీని అధికారులు... ఆయన తర్వాత పదోన్నతి తీసుకున్న ముగ్గురు మహిళా టీచర్లను పిలిపించి చివర పదోన్నతి తీసుకున్న టీచరు రివర్షన్ వెళ్లాలని సూచించారు. ఇందుకు సదరు టీచరు ససేమిరా అంటుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.